# ప్రశాంతి

(గల్పిక)

"మనం చరిత్రనుంచి నేర్చుకోక, పడిన గోతిలోనే మళ్ళీ మళ్ళీ పడుతున్నాం. లేకపోతే ఈ అరాజక మేమిటి ?" అన్నాడు దిబ్బజ్ఞాని.

"దీనికీ చరిత్రకూ సంబంధం ఉన్నదా ?" అన్నాను.

"అరాజకమనేది చరిత్రకు తరచుగా వచ్చే జ్వరం. అది చరిత్ర అంత ప్రాచీనమైనది.

"మిడిగుడ్ల రాజావారి హైములో చెప్పనలవికాని అరాజకం వచ్చింది. ఎక్కడ చూసినా దరిద్రం తాండవించింది దొంగతనాలూ, దోపిడీలూ, హత్యలూ, గృహదహనాలూ విచ్చలవిడిగా జరిగాయి. మా తాతగారి పొరుగున ఉండే ఇంట్లో తిండికోసం దొంగలు పడి, అడ్డంవచ్చిన అరవై ఏళ్ళ ముసలి ముండను చంపారు.

"రాజావారు చేయగలిగినదంతా చేశారు. గుళ్ళలో అర్చనలు చేయించారు. క్షుద్రదేవతలకు బలులు ఇప్పించారు. వర్తకులమీద పన్నులూ, భూస్వాముల శిస్తులూ మాఫీ చేశారు. ఏమీ లాభం లేకపోయింది.

"అప్పుడు రాజావారు ఏం చేశారనుకున్నావు ? రాత్రయేది, పగలయేది వీధుల్లో తిరిగితే చంపెయ్యమని గస్తీ వాళ్ళకు ఉత్తరువు లిచ్చారు. మొదట కొద్దిరోజులు వీధుల్లో కొందరిని చంపారట. ఆ తరవాత దొంగతనాలూ, దోపిడీలూ, కొంపలు తగలబెట్టటాలూ నిలిచిపోయాయి.

"మూడు మాసాలపాటు మనుషుల మధ్య సంపర్కాలు లేక కొందరు రోగులు చచ్చారనీ, కొందరు ఆహార పదార్థాలు కొనటానికి బయటికిపోతే అకలికి మాడి చచ్చారనీ, ఇలాగే ఇతర కారణాలవల్ల ఇంకా కొందరు చచ్చారనీ అన్నారు. జనం చస్తేనేం ? జనం చావకుండా ఎందుకుంటారు ? కాని రాజావారి ఎత్తు బ్రహ్మాస్త్రంలాగా పని చేసి, తక్కున శాంతి నెలకొన్నది," అని దిబ్బజ్ఞాని ముగించాడు

---

*కొడవటిగంటి కుటుంబరావు*